333)పాడి

ప॥ చంచలపడగవద్దు సారె సారె గోరవద్దు। పొంచుకొన్నదైవమే బుద్ధులు నేర్పీని॥

చ॥ లోకరక్షకుడు నాలోననే వున్నాడిదే। నాకు నభయములిచ్చి నన్ను గాచును।
శ్రీకాంతు డీతడే నాచిత్తములో మలసీని। దాకొని శుభములెల్లా దానే వొసగును॥

చ॥ పరమపురుషుడు నాప్రాణనాథుడైనాడు। పరగ నాపాలివాడై బ్రదికించును।
ధరణీశు డీతడే నాదాపుదండై కడగీని। నిరతి నేపొద్దును మన్నించును మమ్మెపుడు॥

చ॥ శ్రీవేంకటేశుడు నాజిహ్వ దగిలి వున్నాడు। పావనును జేసి నాకు ఫల మిచ్చును।
గోవిందు డీస్వామి నన్ను గొలిపించుకొన్నవాడు। యీవలనావల నాకు నిహపరా లిచ్చును॥